నగర పంచాయతీ భవనం పూర్తయ్యేనా?

- రెండేళ్ల క్రితమే నిధులు మంజూరైనా సాగని నిర్మాణం
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నాసిరకంగా పనులు
- మిగులు నిధులపై సందిగ్ధం

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చి నగర పంచాయతీ భవన నిర్మాణ పనులు నత్తతో పోటీ పడుతున్నాయి. నిధులు మంజూరై రెండేళ్లు పూర్తయినా నిర్మాణం సక్రమంగా జరగకపోవడంతో అవి పక్కదారి పట్టినట్లు ఆరోపణలున్నాయి. గత ప్రభుత్వ హయాంలో పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ఎస్‌డీఎం నిధులతో బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ నిర్మాణానికి రూ.రెండు కోట్లను మంజూరు చేసింది. అందుకు సంబంధించి 2021 అక్టోబర్ 25న అప్పటి కలెక్టర్ చక్రధర్‌బాబు శంకుస్థాపన చేశారు.

లెంటల్ లెవల్‌కే పరిమితం

నగర పంచాయతీ భవనానికి సంబంధించిన పనులను కోవూరు మండలానికి చెందిన ఓ కాంట్రాక్టర్‌కు అప్పటి కమిషనర్ శ్రీనివాసరావు అప్పగించారు. 2022న పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్ అత్యంత నాసిరకంగా పనులు చేస్తూ ఇప్పటి వరకు లెంటల్ లెవల్‌కే గోడలను కట్టి వదిలివేశాడు. అందుకు గానూ నగర పంచాయతీ నిధుల నుంచి రూ.30 లక్షలు చెల్లించినట్లు అధికారులు వెల్లడించారు. అయితే ఆ నిధులకు సరిపోయే పనులు కూడా చేపట్టకపోవడం గమనార్హం. మిగిలిన రూ.1.70 కోట్ల నిధులు వివిధ పనులకు, తమ సొంత పనులకు పక్కదారి పట్టించడంతో నగర పంచాయతీలో కలకలం రేగింది. ముగ్గురు కమిషనర్లు మారినా మిగుల నిధులు మాత్రం ఎక్కడున్నాయోనన్న విషయాన్ని మాత్రం గోప్యంగా ఉంచడం విశేషం. నగర పంచాయతీలో అధికారులు ఓ వైపు, పాలకవర్గం మరో వైపు ఉండడంతో ఒకరి తప్పులను మరొకరు ఎత్తి చూపుకోవడం లేదా నిధుల చర్చ వచ్చినప్పుడు నీకింతా.. నాకింత.. వాడుకున్నాం అన్న రీతిలో ఒక్కటైపోవడంతో భవన నిర్మాణానికి అడ్డంకిగా మారింది. ఎక్కడైనా ప్రభుత్వ భవనాల నిర్మాణం పూర్తయిన తర్వాత ప్రభుత్వాలు బిల్లులు చెల్లించడం పరిపాటి. అయితే ఇక్కడ రూ.10 లక్షలు కూడా చేయని పనికి ముందుగానే రూ.30 లక్షలు అధికారులు ఇచ్చినా కూడా పనులు నత్తనడకన సాగించడం వెనుక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసలు నగర పంచాయతీ కార్యాలయ నిర్మాణం పూర్తవుతుందా..? లేదా..? అనే అనుమానాలు సైతం ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.


నాసిరకంగా జరిగిన నగర పంచాయతీ కార్యాలయ భవనం


భవన నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకం

నాసిరకంగా పనులు


ఇప్పటివరకు సాగిన భవన నిర్మాణ పనులు నాసిరకంగా ఉన్నాయి. దీనిపై ఎన్నిసార్లు హెచ్చరించినా కాంట్రాక్టర్ పట్టించుకోలేదు. ప్రస్తుత ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మరలా పూజలు, గోవులతో ప్రాంగణమంతా తిప్పి పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అయితే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా నిర్మాణ పనులు ఉన్నాయి.

– బిట్రగుంట ప్రమీలమ్మ, కౌన్సిలర్

నిధులు పక్కదారి


నగర పంచాయతీ భవనానికి మంజూరైన రూ.2 కోట్ల నిధులు ఏమైందో తెలియడం లేదు. రూ.30 లక్షలు కాంట్రాక్టర్‌కు ఇచ్చామని చెబుతున్న అధికారులు మిగతా రూ.1.70 కోట్ల నిధుల గురించి స్పష్టత ఇవ్వడం లేదు. ముగ్గురు కమిషనర్లు మారినా ఆ నిధుల విషయం బయటకు రావడం లేదు. దీనిపై కలెక్టర్ విచారణ జరపాలి.

– షేక్ షాహుల్, ఐదో వార్డు కౌన్సిలర్

క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



బుచ్చిరెడ్డిపాళెం: వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండలాధ్యక్షుడు కోవూరు రాఘవ మాజీ మంత్రి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరులోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు, బుచ్చి మండలాధ్యక్షుడు చెర్లో సతీష్‌రెడ్డి, నాయకులు కలువ బాలశంకర్‌రెడ్డి, చిమ్మట శేషగిరి, దేవిరెడ్డి సాయిరెడ్డి పాల్గొన్నారు.

లైసెన్స్ తప్పనిసరి


వాహనదారులతో మాట్లాడుతున్న పోలీసులు

మనుబోలు: 'ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలి. హెల్మెట్ ధరించకపోతే జరిమానా విధిస్తాం' అని ఎస్సై శివ రాకేష్ హెచ్చరించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా గురువారం పోలీస్‌స్టేషన్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనచోదకులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మద్యం తగి వాహనాలు నడపొద్దన్నారు.

ఫార్మసీ విద్యార్థులకు శిక్షణ



కొడవలూరు: నార్తురాజుపాళెంలోని శ్రీవెంకటేశ్వర ఫార్మసీ కళాశాలలో క్లినాక్సీ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో 'క్లినికల్ రీసెర్చ్ అండ్ డేటా మేనేజ్‌మెంట్'పై బుధ, గురువారాల్లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా క్లినాక్సీ సొల్యూషన్స్ సీఈఓ వేమవరపు సతీష్‌కుమార్ మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాల్లో డేటా మేనేజ్‌మెంట్ ముందంజలో ఉందన్నారు. ఇందులో ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్, ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపల్స్ సి.మాధవీలత, ప్రసన్నలక్ష్మీరెడ్డి, ఏఓ కె.గిరీష్‌కుమార్ పాల్గొన్నారు.

'అవినీతిని ప్రశ్నించానని ఇబ్బందులు పెట్టారు'


మాట్లాడుతున్న పీఈటీ హేమలత, ఆమె కుటుంబ సభ్యులు

తోటపల్లిగూడూరు: కోడూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాలలో జరుగుతున్న అవినీతిని ప్రశ్నించినందుకే తనను విధుల నుంచి సస్పెండ్ చేయించారని ఆ కళాశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు హేమలత తెలిపారు. ఈనెల 17వ తేదీ పదో తరగతి పరీక్షలకు సంబంధించి గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు చెన్నపల్లిపాళెం ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రానికి ఆలస్యంగా వెళ్లడంపై బాధ్యులను చేస్తూ ఇద్దరు పీఈటీలను గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ సస్పెండ్ చేశారు. దీంతో హేమలత కళాశాల ఎదుట గురువారం మాట్లాడారు. కళాశాలకు వచ్చే సరుకులను కొందరు అధ్యాపకులతో కలిసి ప్రిన్సిపల్ ఎస్తేరమ్మ బయటకు తరలిస్తూ విద్యార్థుల నోరు కొడుతుంటే సహించలేకపోయానన్నారు. గతంలో జరిగిన ఆడుదాం ఆంధ్రాకు సంబంధించి నిధులను మరో పీఈటీ సహకారంతో ప్రిన్సిపల్ స్వాహా చేస్తే ప్రశ్నించానన్నారు. అందువల్లే ప్రిన్సిపల్ తోటి అధ్యాపకుల ఎదుట తనను తిట్టేదన్నారు. 8 నెలల కాలం జీతం కూడా ఇవ్వకుండా అడ్డుకుందన్నారు. నోటీస్ ఇవ్వకుండా అన్యాయంగా విధులను నుంచి తప్పించడం ఏంటని ప్రశ్నిస్తే తనపై, తల్లిపై ప్రిన్సిపల్, ఆమె కూతురు దౌర్జన్యానికి దిగారన్నారు. అధికారులు న్యాయం చేయాలని హేమలత కోరారు.

బాబా మందిరంలో విశేష పూజలు



పొదలకూరు: పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం విశేష పూజలను నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం పల్లకి సేవ జరిగింది.

వరిగడ్డి దహనంపై కేసు నమోదు

పొదలకూరు: మండలంలోని కనుపర్తి పంచాయతీ పరిధిలో ఆర్‌వై పాళెం గ్రామానికి చెందిన మాలపాటి ఓబుల్‌రెడ్డికి చెందిన వరిగడ్డిని దహనం చేసిన ఘటనపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై హనీఫ్ కథనం మేరకు.. వివరాలు బుధవారం ఓబుల్‌రెడ్డి 1.50 ఎకరాల్లో వరికోతలు పూర్తి చేసి గడ్డిని పొలంలో ఉంచారు. గుర్తుతెలియని వ్యక్తులు గడ్డికి నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డిగ్రీ కళాశాలలో అకడమిక్ ఆడిట్



విడవలూరు: స్థానిక పీఆర్‌ఆర్-వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి అకడమిక్ ఆడిట్‌ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సోషల్ ఆడిట్‌తో పాటు జాబ్‌మేళా, కంప్యూటర్ ల్యాబ్‌లు, లైబ్రెరీ, సైన్స్ ల్యాబ్, కళా సాంస్కృతిక వంటి పలు రికార్డులను పరిశీలించి, కళాశాల పురోగతిపై ఆరా తీసి అభినందనలు తెలిపారు. అనంతరం కళాశాలకు ఏ గ్రేడ్ ప్రకటించారు. కార్యక్రమంలో సోషల్ ఆడిట్ అధికారులు వి.రాజ, జి.యుగంధర్, వైస్ ప్రిన్సిపల్ ఎస్.మధు, అధ్యాపకులు ఐఎస్.చక్రపాణి, వి.శ్రీరామమూర్తి తదితరులు ఉన్నారు.

ఇసనాక కుటుంబానికి ప్రసన్న పరామర్శ


సునీల్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ప్రసన్న

కొడవలూరు: మండలంలోని యల్లాయపాళేనికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత, విజయ డెయిరీ డైరెక్టర్ ఇసనాక సునీల్‌కుమార్‌రెడ్డి (54) అనారోగ్యంతో సోమవారం మృతిచెందడం తెల్సిందే. ఈ క్రమంలో గ్రామంలోని వారి నివాసానికి మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావుతో కలిసి గురువారం వెళ్లి సునీల్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రసన్న మాట్లాడుతూ సునీల్‌కుమార్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటన్నారు. వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని భగవంతుడ్ని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు చిమటా శేషగిరిరావు, నాయకులు బట్టేపాటి నరేందర్‌రెడ్డి, అడపాల మోహనకృష్ణ, దేవిరెడ్డి సాయిరెడ్డి తదితరులు ఉన్నారు.

తమ్మిరెడ్డికి..

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని చెల్లాయపాళేనికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తమ్మిరెడ్డి రత్నం కుమారుడు ఈశ్వరయ్యను మాజీ మంత్రి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గురువారం పరామర్శించారు. రోడ్డు ప్రమాదానికి గురైన ఈశ్వరయ్య చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటూ ఉండడంతో ఆరోగ్య పరిస్థితిపై ప్రసన్న ఆరాతీశారు. పార్టీ మండలాధ్యక్షుడు చెర్లో సతీష్‌రెడ్డి, నాయకులు కనిసిరి వెంకయ్య, కోవూరు రాఘవ ఉన్నారు.


బుచ్చిరెడ్డిపాళెం : ఈశ్వరయ్యను పరామర్శిస్తున్న ప్రసన్న

డిగ్రీ పరీక్షలకు 81 మంది హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో గురువారం నిర్వహించిన డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షలకు 81 మంది హాజరయ్యారని ఎగ్జామ్స్ నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. 84 మందికి గానూ 81 మంది హాజరైనట్లు వెల్లడించారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన

ఇందుకూరుపేట: మండలంలోని కుడితిపాళెం గ్రామంలో కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి విద్యుత్ శాఖ అధికారులు గురువారం స్థల పరిశీలన చేశారు. ఈఈ రమేష్ చౌదరి, ఏడీఈ సురేంద్రబాబు, ఏఈ తీర్థంరెడ్డి గ్రామంలో పరిశీలించారు. సుమారు రూ.2.50 కోట్లతో సబ్‌స్టేషన్‌ను నిర్మిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

'చిన్న వివాదాన్ని పెద్దది చేశారు'

బుచ్చిరెడ్డిపాళెం: గత శుక్రవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో తనను ఓ వ్యక్తి అన్న మాట బాధించిందని, దీంతో ఇద్దరం ఎమ్మెల్యే సాక్షిగా వాదులాడుకున్నామని, ఈ చిన్న ఘటనను తప్పుగా ప్రచారం చేశారని పెన్నా డెల్టా మాజీ చైర్మన్, టీడీపీ నాయకుడు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. రేబాలలోని ఆయన నివాసంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. స్థానిక శాసనసభ్యురాలు తనను పక్కన పెట్టినట్టు అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఇది వాస్తవం కాదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మన్నేపల్లి శ్రీనివాసులు, సర్పంచ్ లఘుతోటి రామలక్ష్మి పాల్గొన్నారు.

22న దుకాణాలకు వేలంపాట

నెల్లూరు(పొగతోట): నగరంలోని మద్రాసు బస్టాండ్ సమీపంలో ఉన్న కోనేరు మార్కెట్‌లో 140 దుకాణాలను మార్కెటింగ్ శాఖ అధికారులు నిర్మించారు. గత నెలలో 71 షాపులకు వేలం నిర్వహించగా, మిగిలిన 69 షాపులకు ఈనెల 22న వేలం పాట నిర్వహించనున్నట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ అనితాకుమారి గురువారం తెలిపారు.

నాడు పార్టీలకు అతీతంగా సంక్షేమం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ముత్తుకూరు: వైఎస్సార్‌సీపీ పాలనలో రాజకీయ పార్టీలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమం జరిగిందని మండలంలోని డమ్మాయపాళెం వైఎస్సార్‌సీపీ నేతలు అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిష్ప్రయోజనమయ్యాయని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేసిన విమర్శపై టీడీపీ నేతలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. నాయకులు సన్నారెడ్డి దయాకరరెడ్డి, పాముల శ్రీనివాసులు, దువ్వూరు రామనాథరెడ్డి, మూగ చిన్న, దువ్వూరు సుబ్బరామరెడ్డి తదితరులు గురువారం విలేకరులతో మాట్లాడారు. గత సంవత్సరం పుట్టి ధాన్యం రూ.23,000లకు అమ్మకాలు చేయగా, ప్రస్తుతం రూ.16,000లకు మించి కొనుగోలు చేయడం లేదన్నారు. వ్యవసాయాధికారులు వచ్చి తమ సమస్యలు తెలుసుకోలేదన్నారు. అన్ని పార్టీల్లో రైతులు ఉంటారని, కష్టనష్టాలు అందరికీ ఉంటాయన్న విషయం టీడీపీ నేతలు గుర్తించాలన్నారు.

సీహెచ్‌సీలో దంత వైద్య శిబిరం

పొదలకూరు: వరల్డ్ ఓరల్ డే సందర్భంగా పొదలకూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో గురువారం దంత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దీనికి హాజరైన వారికి దంత వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా పేస్ట్, మౌత్ లోషన్ అందజేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ యు.ప్రసాద్ మాట్లాడుతూ సీహెచ్‌సీలో దంత పరీక్షలను తరచూ చేయించుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యులు, సలహా కమిటీ బాధ్యులు టి.మస్తాన్‌బాబు, మల్లికార్జున్‌నాయుడు, బి.భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


శిబిరంలో పాల్గొన్న వైద్యులు తదితరులు

అండర్‌పాస్ మంజూరుకు చర్యలు

- కృతజ్ఞతలు తెలిపిన జెడ్పీ చైర్‌పర్సన్

నెల్లూరు(పొగతోట): చింతారెడ్డిపాళెంలో హైవే వద్ద అండర్‌పాస్ మంజూరు చేస్తామని తెలిపిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి, దీనికి కృషిచేసిన తిరుపతి ఎంపీ గురుమూర్తి, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, 20 కార్యక్రమాల చైర్మన్ లంకా దినకర్‌లకు జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ గురువారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. నగరంలోని చింతారెడ్డిపాళెం హైవే వద్ద నిత్యం ట్రాఫిక్ అంతరాయం, ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ఈ ప్రాంతంలో అండర్‌పాస్ నిర్మించాలని కోరుతూ ఎంపీలు గురుమూర్తి, డీకే అరుణల దృష్టికి జెడ్పీ చైర్‌పర్సన్ తీసుకెళ్లారు. వారు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి తెలియజేశారు. ఇందుకు స్పందించిన కేంద్రమంత్రి అండర్‌పాస్ మంజూరు చేస్తామని తెలిపారు.

వేతనాలు ఇప్పించాలని వినతి

మనుబోలు: తమకు వేతనాలను ఇప్పించాలని మండలంలోని పికిల్ ఫ్యాక్టరీ మహిళా కార్మికులు లేబర్ కమిషనర్ రాజశేఖర్‌కు విన్నవించారు. గురువారం నెల్లూరులో ఆయన్ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము అక్కంపేట సమీపంలో ఉన్న పికిల్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నామని తెలిపారు. గతేడాది ఫిబ్రవరి నుంచి నవంబర్ వరకూ వేతనాలు సక్రమంగానే చెల్లించారన్నారు. అయితే డిసెంబర్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకూ వేతనాలివ్వలేదని చెప్పారు. యజమానిని అడిగితే నష్టం వచ్చిందంటూ వేతనాల చెల్లింపును వాయిదా వేస్తున్నాడని వాపోయారు. ఇటీవల ఈ విషయమై మనుబోలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై లేబర్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారన్నారు. న్యాయం చేయాలని కోరారు. వారి వెంట సీఐటీయూ జిల్లా నాయకుడు గోగుల శ్రీనివాసులు, సీపీఎం నాయకుడు దేవదానం ఉన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు, నేతలు

పింఛన్‌దారులకు వైద్య పరీక్షలు

పొదలకూరు: స్థానిక సీహెచ్‌సీలో ఏడు మండలాలకు సంబంధించి సదరం సర్టిఫికెట్ల కోసం పింఛన్‌దారులకు వైద్య పరీక్షలను గురువారం ప్రారంభించారు. శుక్ర, శనివారాల్లో నిర్వహించి సర్టిఫికెట్లను అందజేస్తామని అధికారులు వెల్లడించారు. ఆ మండలాల్లోని 2,322 మందికి పరీక్షలను నిర్వహించడం జరుగుతుంది. ఇప్పటి వరకు నాలుగు మండలాలకు చెందిన పింఛన్‌దారులకు పరీక్షలను పూర్తి చేశారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని పొదలకూరు, ముత్తుకూరు, వెంకటాచలం, మనుబోలు, తోటపల్లిగూడూరు మండలాలతోపాటు వెంకటగిరి నియోజకవర్గంలోని సైదాపురం, రాపూరు మండలాలకు చెందిన దివ్యాంగ పింఛన్‌దారులకు ఇక్కడ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు వైద్యులు తెలిపారు.


దివ్యాంగ పింఛన్‌దారుడి పేరు నమోదు చేస్తున్న సిబ్బంది

రౌడీషీటర్ బైండోవర్

నెల్లూరు(క్రైమ్): రౌడీషీటర్ల కదలికలపై చిన్నబజారు పోలీసులు నిఘా పెంచారు. ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు పర్యవేక్షణలో ఎస్సై అబ్దుల్ రజాక్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం తనిఖీలు నిర్వహించారు. గాంధీబొమ్మ వద్ద అనుమానాస్పదంగా ఉన్న ఖుద్దూస్ నగర్‌కు చెందిన రౌడీషీటర్ జలీల్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అతన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి బైండోవర్ చేశారు.

అధికారుల మీనమేషాలు ఎందుకు..?

- అవినీతికి పాల్పడ్డారని తెలిసినా చర్యలు ఏవీ?
- షోకాజ్ నోటీస్‌తో సరిపెట్టేసిన ఉన్నతాధికారులు

జిల్లా బీసీ సంక్షేమ శాఖలో ఇద్దరు వార్డెన్లు అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని నివేదికలు తేల్చాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు గత నెల 28వ తేదీన షోకాజు నోటీసులు కూడా జారీ చేశారు. అయినా ఇంత వరకు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


విడవలూరు బీసీ సంక్షేమ హాస్టల్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): విడవలూరు, మైపాడు బీసీ సంక్షేమ హాస్టల్స్‌లో ఇద్దరు వార్డెన్లు అవినీతి అక్రమాలకు పాల్పడ్డారు. రెండేళ్లుగా సాగుతున్న ఈ తంతుపై ఫిబ్రవరి 23వ తేదీన సాక్షి దినపత్రికలో 'వీరిపై చర్యలు తీసుకోరా..' అనే కథనం ప్రచురితమైంది. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ వారికి షోకాజు నోటీసులు ఇవ్వమని ఆశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. హడావుడిగా ఆ ఇద్దరు వార్డెన్లకు ఆశాఖ అధికారులు షోకాజు నోటీసులు కూడా ఇచ్చారు. నెలకావస్తున్నా ఆ వార్డెన్ల నుంచి ఎటువంటి సమాధానం రాలేదు. అయితే గురువారం బీసీ సంక్షేమ శాఖ అధికారిని ఈ విషయంపై ఆరా తీయగా ఇద్దరు వార్డెన్లలో ఒకరు సమాధానం ఇచ్చారని, మరో వార్డన్ ఇవ్వాల్సి ఉందని చెప్పుకొచ్చారు.

ఉన్నతాధికారులకు వాటాలు?

గత రెండేళ్లుగా జరుగుతున్న అవినీతిపై బీసీ సంక్షేమ శాఖాధికారులు ఎటువంటి పర్యవేక్షణ, విచారణ చేయకపోవడం ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. కలెక్టర్ ఆదేశించినా వార్డెన్ల దగ్గర నుంచి సమాధానం రాకపోవడం వారి నిర్లక్ష్యాన్ని తెలియజేస్తుంది. వార్డెన్లు స్వాహా చేసిన సొమ్ముకు సంబంధించి అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ శాఖాధికారులకు వాటాలున్నట్లు వార్డెన్లే చెప్పుకొస్తున్నారు. కలెక్టర్ ఇచ్చిన షోకాజు నోటీసులకు సైతం వార్డెన్లు సమాధానం చెప్పడం లేదంటే ఏ స్థాయిలో ఆశాఖలో అవినీతి ఏరులై పారుతుందో అర్థం చేసుకోవచ్చు. అయితే ఇద్దరు వార్డెన్లలో ఒకరి నుంచి సమాధానం రావాల్సి ఉందని, ఇందుకు సంబంధించిన నివేదిక కలెక్టర్‌కు ఇవ్వాల్సి ఉందని, తదుపరి ఆయన ఇచ్చే ఆదేశాలను పాటిస్తామని జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారిణి వెంకలక్ష్మమ్మ చెప్పడం గమనార్హం.